ప్రజాశక్తి
సోమవారం 17 నవంబర్ 2025
5
విజయనగరం



భూములను పరిశీలిస్తున్న వ్యకాస, సిపిఎం నాయకులు

బలవంతపు భూసేకరణపై ఉద్యమం

వార్త మెయిన్‌లో

మొంథా తుపాను ప్రభావం కూరగాయల సాగుపై పడింది. దీంతో సామాన్యుడికి కష్టాలు మొదలయ్యాయి. భారీ వర్షాల కారణంగా చాలా చోట్ల పంట నష్టపోవడంతో దిగుబడి తగ్గింది. ఫలితంగా కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రైతుబజారుల్లో దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు అర్ధసెంచరీ కొట్టేశాయి. ఆగాకర అయితే సెంచరీ చేసేసింది. ఈ సీజన్‌లో అందరికీ అందుబాటులో ఉండే కోడి ధర సైతం కొండెక్కింది. కూరగాయాల ధరలు మున్ముందు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



కూరగాయల ధరువు

- 'మొంథా' ప్రభావంతో తగ్గిన దిగుబడి
- రోజురోజుకీ పెరుగుతున్న ధరలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. రైతు బజారులో ఏ కూరగాయని టచ్ చేసినా భగ్గుమంటున్న ధరలతో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. కరివేపాకు నుంచి కాకరకాయ వరకు, వంకాయ నుంచి వెల్లుల్లి వరకు, చికెన్ నుంచి మటన్ వరకు ఏది చూసినా అధిక ధరలు ఉన్నాయి. గత నెల రోజులుగా పెరుగుతున్న ధరలతో మార్కెట్ ధరల బోర్డులో రేట్లు సాధారణం కంటే రెట్టింపునకు చేరుకున్నాయి. సాధారణంగా కార్తీక మాసంలో కూరగాయల ధరలు పెరుగుతాయని చెబుతారు. కానీ ఈ ఏడాది ధరల మోత కాస్త గట్టిగానే వినబడుతోంది. మరోవైపు కిలో చికెన్ రూ.220, మటన్ రూ.900, కోడి గుడ్డు ఒక్కొక్కటి రూ.7కు చేరడం గమనార్హం.

ముంచేసిన 'మొంథా'

గత నెలలో మొంథా తుపాను సమయంలో కురిసిన వర్షాలతో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ఆగాకర రూ.110కు చేరింది. ప్రతి కూరలోనూ వినియోగించే టమోటా ధర ఆదివారం రైతుబజార్లలో కిలో రూ.44కు చేరింది. దీంతో ప్రజలు రానున్న రోజుల్లో ఇంకా ఎంత పెరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కిలో వంకాయలు రూ.66, బెండకాయలు రూ.60, కాకరకాయలు రూ.50, బీరకాయలు రూ.55, పొడుగు చిక్కుడు/బర్బాటి రూ.65, క్యారెట్ రూ.60, దొండకాయలు రూ.60, బీట్ రూట్ రూ.48, అల్లం రూ.80, పచ్చిమిర్చి రూ.43, వెల్లుల్లి రూ.85, గోరుచిక్కుడు రూ.50, మునగకాడలు రూ.70, కేప్సికం రూ.80, ఫ్రెంచిబీన్స్ రూ.70కు చేరాయి. ఒక్కొక్క అరటికాయ రూ.10, కాలీఫ్లవర్ రూ.50 పలుకుతున్నాయి. దీంతో కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుక్కోవాలంటేనే సామాన్యులు భయపడుతున్నారు. ప్రభుత్వం కలుగజేసుకొని సబ్సిడీలో అందిస్తే బాగుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

రైతుబజార్ ధరలు

కూరగాయ రకం	కిలో ధర
వంకాయలు	66
టమాట	44
బెండకాయలు	60
కాకరకాయలు	50
బీరకాయలు	55
క్యాబేజి	35
చిక్కుడు	65
క్యారెట్	60
దొండకాయలు	60
బీట్ రూట్	48
ఉల్లిపాయలు	20
బంగాళదుంపలు	20
అల్లం	80
పచ్చిమిర్చి	43
వెల్లుల్లి	85
గోరుచిక్కుడు	50
మునగకాడలు	70
కేప్సికం	80
కీరదోసకాయలు	40
కందదుంపలు	70
చామదుంపలు	40

సమాజ మార్పులో యువ రచయితల పాత్ర కీలకం

'ఆనందమాయే సఖి' నవల ఆవిష్కరణ సభలో రచయిత అట్టాడ

ప్రజాశక్తి - విజయనగరం కోట

సమాజ మార్పులో యువ రచయితల పాత్ర కీలకంగా ఉండాలని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు సూచించారు. నేటి సమాజంలో పత్రికలు, మీడియా.. పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లడం వల్ల వాస్తవాలు, సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలు వెలుగు చూడటం లేదన్నారు. ఈ నేపథ్యంలో కవులు, రచయితలే సామాజిక మార్పులు, పరిణామాలను స్వేచ్ఛగా రాయగలుతున్నారని తెలిపారు. ఇందులోనూ యువత రచయితల పాత్ర, చొరవ కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సాహితీ స్రవంతి - జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యాన యువ రచయిత వావిలపల్లి సృజన రాసిన 'ఆనందమాయే సఖి' నవలను విజయనగరంలోని గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి సభ్యులు చీకటి చంద్రికారాణి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ నవలలో కీలకమైన పాత్రధారులంతా కళాత్మకమైన పాత్ర పోషించడం ద్వారా సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందించాలనే ఆలోచన కవి సృజనలో అడుగడుగునా కనిపించాయని కొనియాడారు. స్వేచ్ఛ, ఇతర సమస్యలు పేద, ధనిక.. అనే తేడా లేకుండా అన్ని కుటుంబాల్లోనూ ఉన్నప్పటికీ రైతులు, కార్మికులు, శ్రమజీవుల సంఘర్షణ, వారి పోరాటాల నుంచి మాత్రమే సమాజ మార్పు ఉంటుందని వివరించారు. ఈ కీలకమైన అంశాన్ని కవులు, రచయితలు తప్పక గమనంలో పెట్టుకున్ని రచనలు చేస్తే అవి తప్పకుండా సమాజాభివృద్ధికి, చైతన్యానికి తోడ్పాటు అందిస్తాయని అన్నారు. నేటి సమాజంలో మనుషుల మధ్య అంతరాలు సృష్టించేందుకు అనుసరిస్తున్న పరిస్థితులను, విచ్ఛిన్నకర ఆలోచనలు రచయితలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతో మంది రచయితలు ఉన్నప్పటికీ సామాజిక సమస్యలపై రాసినవారు కొంతమందే ఉన్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో సృజన నవయువ ఆశాకిరణంగా కనిపిస్తున్నారని కొనియాడారు.

జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు మాట్లాడుతూ నవలలో సృజన భాష, భావం ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని, పాత్రధారుల మాటలు చదువుతుంటే కొంతమంది కలిసి మాట్లాడుకుంటున్నట్లుగానే ఉందని అన్నారు. నవలలో సామాజిక బాధ్యత, మూఢవిశ్వాసాలు, మహిళల స్వేచ్ఛలేకపోవడం వల్ల జరిగే నష్టాల గురించి చక్కగా వివరించారని, శాస్త్రీయ ఆలోచనలు కూడా ఉన్నాయని కొనియాడారు. ఇప్పటికే ఎనిమిది కథలు రాయడం, తాజాగా ఓ పెద్ద నవల రాసేందుకు సాహసించడం అభినందనీయమన్నారు. రచయిత సృజన మాట్లాడుతూ ప్రస్తుత యువ తరంలో ఏం జరుగుతుందో నవల ద్వారా తెలియజేసినట్లు వెల్లడించారు.

అనంతరం జన విజ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షులు ఎల్.చిన్నారి మాట్లాడారు. కవి, విమర్శకులు జివిఎస్ జయపాలరావు అతిథులకు ఆహ్వానం పలకగా, యువ కవి పాయల మురళీకృష్ణ ఆప్తవ్యాక్యాలు అందించారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కె.రమాదేవి పుస్తక సమీక్ష, యువ కవి గూండ్ల వెంకటనారాయణ నవల పరిచయం చేశారు.

'ఆనందమాయే సఖి' నవలను ఆవిష్కరిస్తున్న రచయిత అట్టాడ అప్పలనాయుడు, రమాప్రభ, వెంకట్రావు, తదితరులు



ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం పిఎసిఎస్ వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గతేడాది 3.34 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ధాన్యం సేకరణకు జిల్లాలో 382 కొనుగోలు కేంద్రాలను, 261 క్లస్టర్లను ఏర్పాటు చేశామన్నారు. 159 మిల్లులను గుర్తించామని, వాటి సామర్థ్యాన్ని బట్టి ధాన్యం సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలిపారు. చెల్లింపులు 48 గంటల్లోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, జనసేన నాయకులు మర్రాపు సురేష్, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, టిడిపి మండల అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, డైరెక్టర్లు గొర్లి బంగారం నాయుడు, కడవల అప్పయ్యమ్మ, టిడిపి సీనియర్ నాయకులు లెంక చిన్నంనాయుడు, లెంక సత్యనారాయణ, ఎస్.రామ్ కుమార్, వివి ప్రదీప్ కుమార్, జనసేన సీనియర్ నాయకులు కలిగి పండు, కడమల శ్రీను, కృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో సత్తా

విజయనగరంటౌన్ : కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లా స్కేటర్లు అదరగొట్టారు. 3 బంగారు, 7 వెండి, 3 కాంస్య పతకాలు సాధించి జిల్లా సత్తా చాటారు. ఉజ్వల్, దేవాన్ష్, భార్గవ సాయి బంగారు పతకాలు సాధించారు. వీరిని రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎపివిఎంఎస్ మూర్తి, జిల్లా అధ్యక్షులు సీతారామరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసరావు, మోహన్‌రావు, కోచ్‌లు బద్రీ నారాయణ, మురళీకృష్ణ , శ్యామ్, సలీం పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ ఛాంపియన్ విజయనగరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా విజయనగరం జిల్లా నిలిచింది. మండలంలోని కొండవెలగాడలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 12వ రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలలో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటారు. ఉమెన్, మెన్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఉమెన్స్ విభాగంలో బెస్ట్ వెయిట్ లిఫ్టర్‌గా కొండవెలగాడ క్రీడాకారిణి సుస్మిత నిలిచారు. మెన్స్ విభాగంలో కడప జిల్లాకు చెందిన రవిశంకర్ బెస్ట్ లిఫ్టర్‌గా సత్తా చాటారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నీలంశెట్టి లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు బహుమతులు ప్రదానం చేశారు. త్వరలో గ్రామంలో ఏర్పాటు చేయనున్న జిమ్‌ని ఎమ్‌పి కలిశెట్టి పరిశీలించి అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. తొలుత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన క్రీడాకారిణి సత్యజ్యోతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, నాయకులు దంతులూరి అజయ్ బాబు, మొయిద సత్యనారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీను, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు అట్టాడ లక్ష్మంనాయుడు, చల్లా రాము, వల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందిస్తున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ఐక్య పోరాటాలతో కార్మిక హక్కుల సాధన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను, ప్రభుత్వ రంగాలను కాపాడుకోగలమని ఎఐఎఫ్‌టియు పిలుపునిచ్చింది. ఆదివారం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో విజయ దుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆర్. నారాయణ రావు అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండ మాట్లాడుతూ చట్టబద్ధంగా ఉన్న 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచి కార్మికులను మరింత దోపిడీకి గురిచేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్మికులు పనిచేయడం లేదని అంటున్నారని, మరి కార్మికులు పనిచేయకుండానే రూ.4 వేల కోట్లతో ప్రారంభమైన విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ఈరోజు ఆరు లక్షల కోట్ల విలువ చేసేదిగా మారిందా? అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించకుండా ప్రభుత్వాలు ఆ నెపాన్ని కార్మికుల మీదకు నెట్టేస్తున్నాయని దుయ్యబట్టారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ జ్యూట్, చక్కెర ఫ్యాక్టరీలను మూసి వేయడం ద్వారా ఒకవైపు కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని, మరోవైపు రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేదని తెలిపారు. సదస్సులో కార్మిక నగారా పత్రిక సంపాదకులు ఆడారి అప్పారావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, రాష్ట్ర నాయకులు పి.శ్రీను నాయుడు, పిడిఎస్‌ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. భాస్కరరావు, పిడిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.విశ్వనాథ్, విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అప్పలరాజు రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి 30వ కుష్టు వ్యాధిగ్రస్తులు గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటిని సర్వే చేయడానికి ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయగలిగేదేనని, ప్రారంభ దశలో గుర్తించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సర్వేకు ఇంటికి వచ్చిన సిబ్బందికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చెస్‌లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయవాడలో ఇటీవల జరిగిన ఇంటర్ సర్కిల్ చెస్ టోర్నమెంట్‌లో టీమ్ ఈవెంట్‌లో విజయనగరం జట్టు సత్తాచాటి, ద్వితీయ స్థానం సాధించింది. సింగిల్స్ విభాగంలో ఎస్.విజయకుమార్ ద్వితీయ స్థానంలో నిలిచి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. చెస్‌లో సత్తాచాటిన క్రీడాకారులు ఎ.రామకృష్ణ, ఎస్.విజయకుమార్, ఎస్.శివప్రసాద్, జూనియర్ ఇంజనీర్ ఎస్.సత్యనారాయణ, చంద్రశేఖర్, మేనేజర్ పి.పైడిరాజును ఆ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఇఇ పి.త్రినాథరావు, ఎస్.అప్పలనాయుడు, లక్ష్మీనారాయణ, వి.మోహన్ బాబు, జి.అప్పలసూరి అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్ఇ లక్ష్మణరావు

చేతబడి హత్యలను నివారించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

చేతబడి హత్యలను నివారించాలని భారత నాస్తిక సమాజం జాతీయ సమన్వయకర్త రవి, రాష్ట్ర నాయకులు సునీత ప్రభుత్వాన్ని కోరారు. భారత నాస్తిక సమాజం ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశాన్ని ఆదివారం నగరంలోని బాలాజీ నగర్‌లో నిర్వహించారు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని, ఆలోచన తత్వాన్ని పెంచే విధంగా ఇబ్బడిముబ్బడిగా సభలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని శాసనసభలో ఆమోదించి అమలు చేయాలని కోరారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా నిర్వహించవద్దని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆ మోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌పి రామకృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి.జోగినాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మీసాల సీతారాం, పి.షణ్ముఖరావు, బి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న నాస్తిక సమాజం సభ్యులు

ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

ఉరితాళ్లతో నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితులు వినూత్నరీతిలో ఉరితాళ్లు బిగించుకుని నిరసన చేపట్టారు. జిందాల్ పరిశ్రమకు సేకరించిన భూములను తిరిగి చెల్లించాలని కోరుతూ నిర్వాసితులు చేపడుతున్న నిరసన శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రాణాలకు తెగించి అయినా భూములను కాపాడుకుంటామంటూ మెడకు ఉరితాళ్లను బిగించుకుని నిర్వాసితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం, జిల్లా అధికారులు భూములు తీసుకున్నప్పుడు తియ్యటి మాటలు చెప్పి నిర్వాసితులను మభ్యపెట్టి, ని విమర్శించారు. నేడు అమ్మకానికి పెడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఘనంగా పత్రికా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక గాజులరేగ శాఖా గ్రంథాలయంలో ఆదివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో పత్రికా రంగంలో విశేష సేవలు అందిస్తున్న జర్నలిస్టులను జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎం.వి.ఎన్ వెంకట్రావు చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా ఉంటాయన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తున్న జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ లక్ష్మణరావు, గ్రంథాలయ సేవా సంఘం పట్టణ శాఖ కన్వీనర్ త్యాడ ప్రసాద్ పట్నాయక్, భగత్ సింగ్ ఆర్గనైజేషన్ కార్యదర్శి గణేష్, ఆకుల శ్రీనివాస్, నాయుడు పాల్గొన్నారు.

సమాజంలో పత్రికలు కీలకం

విజయనగరం టౌన్ : సమాజంలో పత్రికలు ఎంతో కీలకమని మేయర్ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అంబటిసత్రం జంక్షన్ వద్దనున్న సర్ సి.వై. చింతామణి విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టులను ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాజాం, రామభద్రపురంలో పత్తి కొనుగోలు కేంద్రాలు

- మద్దతు ధర రూ.8110
- దళారులను నమ్మి మోసపోవాల్సిన అవసరం లేదు
- జిల్లా వ్యాప్తంగా 5,300 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఇ-క్రాప్‌కి బదులుగా కపాస్ కిసాన్
- 'ప్రజాశక్తి'తో మార్కెటింగ్ ఎడి బి.రవికిరణ్ ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని పత్తి కొనుగోలు చేసేందుకు రాజాం మార్కెట్ యార్డు, రామభద్రపురం మండలం ముచ్చెర్లవలసలోని జన్నింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రవికిరణ్ తెలిపారు. ఈ ఏడాది పత్తి క్వింటాకు ధర రూ.8110 చొప్పున మద్దతు ధర ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో దళారులను నమ్మి మోసపోవాల్సిన అవసరం లేదని చెప్పారు. పత్తిసాగు విస్తీర్ణాన్ని బట్టి జిల్లా వ్యాప్తంగా సుమారు 5,300 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. ఇ-క్రాప్ బుకింగ్ కాని రైతులు తమ సెల్ ఫోన్ ద్వారా కపాస్ కిసాన్ అనే యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని, పత్తి విక్రయంలో ఎదురైన ఆటంకాలను తొలగించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

➡ జిల్లాలో పత్తి సాగు, ఉత్పత్తి, కొనుగోలు లక్ష్యం పరిస్థితి ఏమిటి.?

జిల్లా వ్యాప్తంగా 16 మండలాలు 140 గ్రామాల పరిధిలో సుమారు 6 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది పత్తి సాగు అయ్యింది. తద్వారా 5,298.70 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఈ మేరకు కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇదంతా 87 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉంటుంది. ఆయా కేంద్రాల ద్వారా పత్తి రైతులకు క్రయ, విక్రయాలపై అవగాహన కల్పించే పనిలో ఉన్నాం.

➡ జిల్లాలో ఎన్ని పత్తి కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి? ధర పరిస్థితి ఏమిటి.?

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యాన పత్తి కొనుగోలు జరుగుతోంది. ఈ ఏడాది క్వింటా కనీస మద్దతు ధర రూ.8,110గా నిర్ణయించారు. జిల్లాలో రెండు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇవి రాజాం మార్కెట్ యార్డు, రామభద్రపురం మండలం ముచ్చెర్లవలసలోని ప్రతు జిన్నింగ్ మిల్లులో ఉన్నాయి. ఈ కేంద్రాల్లో రైతులు తమ పత్తి విక్రయించుకోవచ్చు.

➡ నాణ్యత, రకాలను బట్టి ధర మారే అవకాశం ఉంటుందా.?

అవును! పొట్టి పింజ రకం-మైక్రోనేయర్ వాల్యూ 4.3-5.1 మద్దతు ధర క్వింటా రూ.7.710, పొడుగు పింజ రకం - మైక్రోనేయర్ వాల్యూ 3.5-4.3 మద్దతు ధర క్వింటా రూ.8110 ఉంది.

➡ పత్తిలో నాణ్యతకు ప్రామాణికం ఏమిటి.?

8 శాతం నుండి 12 శాతం వరకు ఉన్న పత్తిని మాత్రమే ప్రభుత్వ ధరకు కొనుగోలు చేస్తారు. 8 నుండి 12 శాతం వరకు పెరిగిన ప్రతి ఒక్క శాతానికీ 1 శాతం చొప్పున మద్దతు ధరలో తగ్గిస్తారు. 12 శాతం కంటే ఎక్కువ వచ్చిన పత్తిని సిసిఐ కొనుగోలు చేసేందుకు అసక్తి చూపించే పరిస్థితి ఉండదు.

➡ కొనుగోలు ప్రక్రియ ఎలా ఉంటుంది.?

రైతులు తమ పత్తితోపాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకొని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి, అక్కడున్న వివిఎలతో సిఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆ తరువాత కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే నిర్దేశించిన సమయానికి తాము ఎంచుకున్న కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకుని వెళ్లవచ్చు. రైతులు నేరుగా తమ ఆండ్రాయిడ్ / ఆపిల్ మొబైల్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. రైతులు ముందుగా తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు సుమారుగా 3 కేజీల నుండి 5 కేజీల వరకు తీసుకెళ్లి నాణ్యతను పరీక్షించుకోవడం ద్వారా విక్రయం విషయంలో సులువుగా ఉంటుంది.

➡ రంగుమారిన పత్తి పరిస్థితి ఏమిటి.?

గుడ్డి పత్తికాయలు, రంగుమారిన, పురుగుపట్టిన, ముడుచుకు పోయిన పత్తికాయలను వేరుచేసి శుభ్రమైన పత్తిని తీసుకుని రావాలి. ప్లాస్టిక్ సంచులతో గాని, జ్యూట్ సంచులతో గాని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లరాదు. పత్తిని లూజు రూపంలో తీసుకెళ్లాలి.

➡ చెల్లింపులు ఎలా సాగుతాయి.?

ప్రతి పైసా బ్యాంకు ద్వారానే రైతులకు అందుతుంది. పారదర్శకతే లక్ష్యం. అందుకే రైతులు తప్పనిసరిగా వాడుకలో ఉన్న వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ నెంబర్లతో అనుసంధానం చేసుకోవాలి. అటువంటి ఖాతాలలో మాత్రమే నేరుగా ఆధార్ బేస్డ్ పేమెంట్ ద్వారా నగదు చెల్లింపు జరుగుతుంది. ఇ-పంటలో వివరాలు నమోదు చేసుకున్న రైతులు లేదా కౌలు రైతులు మాత్రమే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తి కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలి. అలా రైతులు కాని వారు పత్తిని తీసుకొస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిసిఐకి అధికారం ఉంటుంది.





చింతామణి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన, జర్నలిస్టులు

ప్రజా సమస్యలు వెలికి తీయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రజా సమస్యలు వెలికి తీసేందుకు పత్రికలు పని చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీకళాభారతి ఆడిటోరియం వద్ద ఉన్న జర్నలిజం పితమహుడు సివై చింతామణి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై నిరంతరం కథనాలు రాసి తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, జర్నలిస్టులు వాసు, జగదీష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు అన్నదానం

కొత్తవలస: జాతీయ జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా పీపుల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయులు ప్రజాశక్తి విలేకరి గుడివాడ పైడిరాజు జ్ఞాపకార్థం చైతన్య మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగానే కొత్తవలస మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ పెనగంటి మంగవేణి భర్త పెనగంటి చెల్లయ్య సహకారంతో రెండు నెలలకి సరిపడా నిత్యవసర సరుకులు గుడివాడ పైడిరాజు కుటుంబానికి పంపిణీ చేశారు. పీపుల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ గురువర్యులు స్వర్గీయులు గుడివాడ పైడిరాజు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన పెనగంటి చెల్లయ్య, కంటకాపల్లి సర్పంచ్ మదీన అప్పల రమణలకు కృతజ్ఞతలు తెలిపారు. కంటకాపల్లి సర్పంచ్ మదీనా అప్పల రమణ మాట్లాడుతూ పీపుల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సేవలు అభినందనీయమని సేవలోనే కాదు ప్రజల సమస్యల్లో కూడా వీళ్ళు ముందుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కాకర శ్రీనివాసరావు, సెక్రటరీ మొయ్యి గణేష్, జాయింట్ సెక్రెటరీ రావలపూడి గోవింద్, ట్రెజరర్ గాడి ప్రసాద్, లీగల్ అడ్వైజర్ సంతోష్, సభ్యులు జనదీపిక రాజు, వివిఎస్‌వన్ శ్రీను, దివ్యాస్త్రం వినకోట వీర్రాజు, రామకృష్ణ, అప్పలసూరి, కృష్ణ ప్రసాద్, జక్కన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో సోమవారం గౌరీ పరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామని టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు గౌరవ పరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారు ఆశీర్వాదాలు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమం గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, యువకులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

బొంతలకోటికి డాక్టరేట్

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన తూర్పు భాగవతం కళాకారులు బొంతలకోటి శంకరరావు భాగవతార్‌కు ఈనెల 22వ తేదీన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జేమ్ పార్క్ హోటల్లో ఊటిలో జరిగే యూనివర్సిటీ ఉత్సవాల్లో గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. బొంతలకోటి భాగవతుల తూర్పు భాగవతంపై అధ్యయనం చేసినందుకు ఈ 'గౌరవ డాక్టరేట్'ను యూనివర్సిటీ అందిస్తున్నట్లు శంకరరావు తెలిపారు. ఈ గౌరవంతో ఈ కళపై మరింత భాధ్యత పెరిగిందని శంకరరావు చెప్పారు. ఈనెల 20వ తేదీన కోమటి పల్లి నుంచి బయలుదేరుతున్నట్టు శంకర రావు చెప్పారు.

వైసిపికి సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండలంలోని భూపాలరాజపురం గ్రామసర్పంచ్ నేరడుబిల్లి గురునాయుడు వైసిపి రాజీనామా చేశారు. ఆదివారం మానాపురం సంతలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2009 నుండి పార్టీనీ నమ్ముకొని పార్టీకి ఎప్పుడూ అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీకి సేవ చేసిన తనకు మండల నాయకులు కానీ జిల్లా నాయకులు గాని ఎప్పుడూ గౌరవం ఇవ్వలేదన్నారు. శాసనసభ ఎన్నికల్లో బొత్స అప్పల నరసయ్య తనను చిన్నచూపు చూశారన్నారు. తమ గ్రామానికి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలిచానని ప్రస్తుతం సర్పంచ్‌గా కొనసాగుతున్నానని చెప్పారు. పార్టీ పరంగా అప్పలనరసయ్య కూడా తనను చాలా ఇబ్బందులు పెట్టారని ఈ విషయాన్ని మండల, జిల్లా నాయకులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. తనను కొంత మంది వైసిపి నాయకులు టార్గెట్ చేసుకొని చాలా ఇబ్బంది పెడుతూ మానసిక ప్రశాంత లేకుండా చేస్తున్నారని, ఇంటి మీదకు కొంత మంది మనుషుల్ని పంపించి దుర్భాషలాడిస్తున్నారని ఆరోపించారు. సొంత పార్టీ మనుషులే తనను ఇంత ఇబ్బందులకు గురి చేస్తే ఆ పార్టీ మనుషులతో మాట్లాడటం తిరగడానికి చాలా ఇబ్బందిగా ఉందని అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. కేవలం కొంతమంది వ్యక్తుల వల్ల ఈ రాజీనామా చేస్తున్నానని ఆయన ప్రకటించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ నారాయణరావు

ప్రజలతో మమేకానికే పల్లెనిద్ర: సిఐ

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రజలతో మమేకానికే పల్లెనిద్ర నిర్వహిస్తున్నట్లు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. శనివారం రాత్రి రొంపల్లి పంచాయతీలో పల్లెనిద్ర చేశారు. ముందుగా గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించి నూతన చట్టాల పనితీరు వివరించారు. మహిళా రక్షణకు పెద్దపీట వేస్తున్నామని దీనిలో భాగంగానే శక్తి యాప్ పటిష్ట పరుస్తున్నట్లు వివరించారు. ప్రతీ మహిళా ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఆపద సమయాల్లో వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకం రవాణా, మద్యం బెల్టు షాపుల నిర్వహణ, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక విధానాలు విడనాడాలని కోరారు. రహదారి భద్రతకు ప్రాధాన్యత నివ్వాలని వాహన చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్రావు, యువత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్టసిటీ స్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇందులో ఫోర్ట్ సిటీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.మోక్షకు ఉత్తమ ప్రతిభా పురస్కారం అందజేశారు. మోక్షకు గ్రంథాలయ సంఘం, జిల్లా పౌరవేదిక, జిల్లా రచయితల సంఘం, వాకర్స్ క్లబ్, తదితర సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రంతో మోక్ష

ఉచితం మాటున భారీ దోపిడీ

◆ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా ◆నాటుబళ్లతో తరలించి డంపింగ్ ◆కాసులు కురిపిస్తున్న ఉచిత పథకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం నెరవేర్చడంలో విఫలమయ్యింది. ఎందుకంటే ఉచిత విధానం రావడంతో అక్రమార్కులు ఇబ్బడి ముబ్బడిగా తాగు నీటి పథకాలను సైతం లెక్కచేయకుండా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. ముఖ్యంగా చంపావతి నది పరివాహక ప్రాంతాలు మొయిద నారాయణ పట్నం, జరజాపు పేట, జ్యూట్ మిల్ బ్రిడ్జి, రామతీర్థం జంక్షన్ నుంచి రామతీర్థం వెళ్లే రహదారి సమీపంలో, సారిపల్లి, జగ్గరాజు పేట, కొత్త పేట సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపి పోగులు పెట్టి అధికరేట్లకు అమ్ముతున్నారు. ఈ ప్రాంతాలన్నీ అనధికార ఇసుక రీచ్‌లు కాగా వాటి మీద రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కూడా దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి.

నాటు బళ్లతో తరలించి డంపింగ్ చేసిన ఇసుక

నాటుబళ్లు ద్వారా బయటకు తరలించి..

నదిలో నీరు ఉండటంతో ట్రాక్టర్లు, లారీలు వెళ్లకపోవడం వల్ల నదిలో నుంచి నాటు బళ్ళు ద్వారా ఇసుకను బయటకు తరలించి కుప్పలు వేసి మరి అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ఉచిత ఇసుక విధానం కాస్తా అక్రమార్కుల వరమై కాసులు వర్షం కురిపిస్తుందని చెప్పవచ్చు. ఉచితం అన్నది ఆసరాగా తీసుకొని అక్రమార్కులు లాభర్జనే ధ్యేయంగా లక్షలాది రూపాయలు దోచుకుంటున్నా, సామాన్య ప్రజానీకం మాత్రం ఇంటి నిర్మాణం గాని మరేదైనా చిన్న చిన్న పనులకు వేలాది రూపాయలు ఇసుక కోసం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోతుల్లో పడి పలువురు మృతి

అనుమతులు లేకుండా నదిలో ఇష్టానుసారంగా ఇసుక కోసం తవ్వకాలు చేయడం వల్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో నదిలో స్నానికి దిగి లోతు తెలియక చాలా మంది ప్రాణాలు పోగుట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అందరికీ సమన్యాయం

ప్రజాశక్తి- భోగాపురం

మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి బబిత

అందరకీ సమ న్యాయం అందరి హక్కు అని, డిఎల్ఎస్ఎ సువలను వినియోగిం చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత అన్నారు. మండలంలోని నందిగామ గ్రామంలో ఆదివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం సమ న్యాయం పొందడం అందరికీ మన రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. పేదరికం లేదా ఇతరత్రా కారణాలవల్ల ఏ ఒక్కరు కూడా న్యాయం పొందకుండా ఉండ కూడదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, నిరుపేదలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు తదితర వర్గాలకు చెందిన వారికి ఉచిత న్యాయ సహాయం, సలహాలు పొందే అవకాశాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తోందని చెప్పారు. ఆదాయం రూ.3లక్షలు కంటే తక్కువ ఉన్న పేదలు, మహిళలు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తదితర బలహీన వర్గాలకు చెందినవారు డిఎల్ఎస్ఎని సంప్రదిం చవచ్చునని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డిఎల్ఎస్ఎను నేరుగా సంప్రదించడం ద్వారా, టోల్‌ఫ్రీ నెంబరు 15100కు ఫోన్ చేయడం ద్వారా కూడా న్యాయ సహాయాన్ని పొందే అవకాశం ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని బాధితులు వినియోగించుకోవాలని సూచిం చారు. ఈ సదస్సులో సిఐ దుర్గా ప్రసాద్, సర్పంచ్ గారే మురళీమోహన్, ఇతర న్యాయ మూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై అలుపెరుగని పోరాటం

ప్రజాశక్తి - గజపతినగరం

ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీ సభ్యులు వీరే..

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి. రాము అన్నారు. ఎస్ఎఫ్ఐ గజపతినగరం మండల మహాసభలు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మహాసభల ప్రారంభంలో మండల అధ్యక్షులు పి. గౌరీ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సంవత్సర కాలంలో మరణించిన అమరవీరులకు ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్. సోమేష్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి. రాము, జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఆర్. శిరీష మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ, విద్యారంగ సమస్యలు మాత్రం పరిష్కారం కావటం లేదని విమర్శించారు. 6 ఏళ్ల క్రితం ఏర్పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ సొంత భవనం లేని పరిస్థితి నెలకొందని దుయ్యబట్టారు.

నూతన మండల కమిటీ ఎన్నిక

మహాసభల ఆమోదంతో 16 మందితో నూతన మండల కమిటీ ఎన్నికైంది. నూతన మండల అధ్యక్షులుగా పి. గౌరీ, మండల కార్యదర్శిగా ఎస్.సోమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆర్.లక్ష్మీ, బి.కృష్ణ, సహాయ కార్యదర్శులుగా నందిని, లోకేష్ ఎన్నికయ్యారు.

చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి రుణాలు

ప్రజాశక్తి- రేగిడి

రైస్ మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ

చిన్న పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అందుకు నిరుద్యోగులకు రుణాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. తోకలవలసలో అత్యాధునిక మోడ్రన్ రైస్ మిల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం దిగుబడి ఉన్న ప్రాంతాల్లో అధునాతన రైస్ మిల్లులను నెలకొల్పడంతో ఈ ప్రాంత రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు. చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం రుణాలు, సబ్సిడీలు సాయం చేస్తుందని అన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించే విధంగా వ్యాపారస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని అన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చి, నేడు నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం బిజెపి సీనియర్ నేత కోటగిరి నారాయణరావు తల్లి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొల్లా అప్పలనాయుడు, కోండ్రు జగదీష్, కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, గురవాణ నారాయణరావు, నంది సూర్య ప్రకాశరావు, సుమల వెంకట మన్మధరావు, పిన్నింటి మోహన రావు, గట్టి భాను, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె

చెత్తకుప్పకు పూజ చేసి నిరసన

ప్రజాశక్తి - గజపతినగరం

చెత్తకుప్పకు పూజలు చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

గజపతినగరం, పురిటిపెంట పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె మూడో రోజు ఆదివారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.లక్ష్మి ఆధ్వర్యంలో ఉధృతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, పురిటిపెంటకు ప్రత్యేకంగా డంపింగ్ యార్డు కేటాయించాలని, కొత్త కార్మికులను తీసుకుంటే తమ కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత చెత్త బళ్ళు, ట్రాక్టర్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు పురిటిపెంట సచివాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెంటాడ రోడ్డులో ఉన్న చెత్తకుప్ప వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వినూత్నంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగేశ్వరరావు, బి.కనక రాజు, బి.గోవిందా, జి.కృష్ణ, ఎస్.కృష్ణ, డి.భాస్కరరావు, మహంకాళి, లక్ష్మీ, యేసు, కోటి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆపాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కోటి సంతకాల పత్రికలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ , తదితరులు

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ ఆపాలని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం మొయిదలో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వల్ల పేద ప్రజలకు వైద్యం దూరమవుతుందన్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీలను ప్రభుత్వం నడపడం వల్ల ఉచిత వైద్య విద్యతో పాటు పేద ప్రజలకు ఉచిత వైద్యం కూడా అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యా వైద్య రంగాన్ని పేద ప్రజలకు దూరం చేయడానికా కుటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు జమ్ము సూర్యసత్యం, చనమల్ల గౌతమి, పి శ్రీను, ధర్మ, ఎం లక్ష్మణరావు, మీసాల అప్పారావు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలని వైసిపి యువజన నాయకుడు దత్తి చిరంజీవి కోరారు. ఆదివారం వంగరలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద ప్రజలకు ఉచిత వైద్యం దూరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మెరకముడిదాం మండలం శ్యామాయవలసకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు దాసరి నాగేశ్వరరావు ప్రమాదవశాత్తూ గాయపడి నగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసి ఆదివారం నాగేశ్వరరావును జెడ్‌పి మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకన్న, తెర్లాం వైస్ ఎంపిపి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 100 మంది రైతులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన స్ప్రేయింగ్ మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్, పూర్వ అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ సన్యాసినాయుడు, శాస్త్రవేత్త తేజేశ్వరరావు, మేనేజర్ ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీకాంత్

ఉద్యోగోన్నతులు కల్పించాలి

పిఎస్‌టిఎ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్లానింగ్ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని పిఎస్‌టిఎ జిల్లా అధ్యక్షులు పి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఎపి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోన వెంకటేశ్వర రావు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శుల సంక్షేమం, గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ, ప్రమోషన్లపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు గురజాడ అశోక్, ఉరిటి చైతన్య సాయి, మహిళా అధ్యక్షురాలు ప్రియాంక, కోశాధికారి వెత్సా మణికంఠ, సహాయ కార్యదర్శి త్రిపురాణ, సందీప్ చంద్ర, మూకల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, జ్ఞానాన్ని సంపాదించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ అధ్యక్షులు రొంగలి పోతన్న కోరారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జయంతి స్మార గ్రంథాలయ సేవా సంస్థ ఆధ్వర్యాన 'అడుగున జాషువా.. అందరిలో జాషువా' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వి.సత్య సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో సమస్యలను ప్రజల ముందు పెట్టి పరిష్కారం చూపిన వ్యక్తి జాషువా అన్నారు. గ్రంథాలయ కార్యదర్శి లక్ష్మి, కవి బంగారు నాయుడు, చిన్నదేవి మాట్లాడుతూ జయంతి రామలక్ష్మణమూర్తి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షులు మజ్జి కాంతారావు, ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా, హై స్కూల్ హెచ్‌ఎం రాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

కంటోన్మెంట్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి శ్రీనివాస్ తెలిపారు. ఎపి గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు మండవిల్లి వెంకటరాజు , సంఘం గౌరవ అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మి జ్యోతి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, సంఘం ఉపాధ్యక్షులు గీతాంజలి శ్రీనివాస్, కార్యదర్శి ఎం.సుభద్రా దేవి, గిరిజా ప్రసన్న, దుడ్డు కామేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకర్తలకు నివాళి

రామభద్రపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, జయంతి రామలక్ష్మణ మూర్తి, పాతూరి నాగ భూషణం వంటి ఉద్యమకర్తలకు స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నివాళులు అర్పించారు. వారు గ్రంథాలయ ఉద్యమానికి చేసిన సేవలు గురించి లైబ్రేరియన్ సత్యవాణి విద్యార్థులకు వివరించారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే నీతి కథల పుస్తకాలను చదివించారు.

డెంకాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల చేత వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించి గ్రంథాలయ సంఘం, ఉద్యమనేతల గురించి వారు గ్రంథాలయ సంఘానికి, సంస్థకు, సమాజానికి చేసిన సేవలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవి సత్య సుధాకర్

రేగిడి: ఉద్యమ నాయకుల అడుగుజాడల్లో నడవాలని శిక్షణ ఫౌండేషన్ జిల్లా మాస్టర్ ట్రైనర్ కెవిపి వల్లీదేవి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటేశ్వరరావుల చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీయన్ పి.ఈశ్వరరావు, మేధావులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రానికి తాళమేనా?

● మూగజీవాలకు అందని వైద్యం ● ఏడాదిగా పశువైద్యాధికారి, సిబ్బంది లేక అవస్థలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పశు వైద్య కేంద్రం మూగజీవాలకు సేవలు అందించింది. గత ఏడాదిగా పశువైద్యాధికారి డిప్యూటేషన్‌పై వెళ్లడంతో సిబ్బంది లేక మూగజీవాలకు వైద్యం లేక పాడి రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒకవేళ మూగజీవాలు అనారోగ్యం పాలైతే మృత్యువాత తప్ప మరే దారి లేదని రైతులు వాపోతున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి మూగజీవాలను కొనుగోలు చేసి పెంచి పోషించడంతోపాటు ఆవులు, గేదెలతో పాలు అమ్మకాలు జరిపి జీవనోపాధి కల్పించిన మూగజీవాలకు వైద్యం లేక మృత్యువాత పడడంతో రైతులు పూర్తిగా అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పశు వైద్య కేంద్రానికి నిత్యం తాళాలు వేసి ఉండటంతో ఉంగరాడతో పాటు గుల్లపాడు, అంబఖండి, వండానపేట గ్రామాలకు చెందిన పశువులు వైద్య సేవలకు దూరమయ్యాయి. పశువులు అనారోగ్యం పాలైతే వాటి లక్షణాలను బట్టి వెటర్నరీ షాపుల వద్దకు వెళ్లి మందులు తీసుకుని వేస్తున్నట్లు రైతులు పొట్నూరు శ్రీనివాసరావు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ పశువైద్య కేంద్రానికి వైద్యాధికారి, వైద్య సిబ్బందిని నియమించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


తాళం వేసి ఉన్న పశువైద్య కేంద్రం

మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.292/2022

Between:
నారంశెట్టి ప్రమీల ....వాది
And:
చెలికాని రమాదేవి వగైరాలు......ప్రతివాదులు
To:
ప్రతివాది నెం.6:
దామెర గణేష్, S/o. శ్రీనివాసరావు, GF-1, వేద రెసిడెన్సీ, స్వామివారి వీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

పై నెంబరు కేసులో వాది పెర్మనెంట్ ఇంజంక్షన్ ఇందలి ప్రతివాదులు పై కోర్టులో దాఖలు చేయగా శ్రీ కోర్టువారు ప్రతివాది నెం.6 హాజరు నిమిత్తము **తేదీ. 21.11.2025**కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినమున మీరు స్వయముగాగాని, వకీలు ద్వారా గాని పై తేదీన **ఉదయం గం.10.30ని.**లకు పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

పై కోర్టువారు ఆర్డర్ ప్రకారం.

P.మణికేశ్వర సాయి,
న్యాయవాది, బొబ్బిలి.
బొబ్బిలి
తేది: 16.11.2025 సెల్ నెం. 9494974403

మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.1303/2022 in O.S.292/2022

Between:
నారంశెట్టి ప్రమీల ....పిటిషనరు/వాది
And:
చెలికాని రమాదేవి వగైరాలు....రెస్పాండెంట్లు/ప్రతివాదులు
To:
రెస్పాండెంటు నెం.6:
దామెర గణేష్, S/o. శ్రీనివాసరావు, GF-1, వేద రెసిడెన్సీ, స్వామివారి వీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో పిటిషనరు/వాది పెర్మనెంట్ ఇంజంక్షన్ కొరకు ఇందలి రెస్పాండెంట్లు/ప్రతివాదులు పై కోర్టులో పిటిషను దాఖలు చేయగా శ్రీ కోర్టువారు రెస్పాండెంటు/ ప్రతివాది నెం.6 హాజరు నిమిత్తము **తేదీ. 21.11.2025**కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినమున మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై తేదీన **ఉదయం గం.10.30ని.**లకు పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

పై కోర్టువారు ఆర్డర్ ప్రకారం.

P.మణికేశ్వర సాయి,
న్యాయవాది, బొబ్బిలి.
బొబ్బిలి
తేది: 16.11.2025 సెల్ నెం. 9494974403